క్లుప్తంగా

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



పల్లంకుర్రులో మాట్లాడుతున్న బీఆర్ యశ్వంత్ భీమ్‌రావు అంబేడ్కర్

కాట్రేనికోన: విద్యతోనే గ్రామాభివృద్ధి సాధ్యమని నమ్మిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన మనమడు బీఆర్ యశ్వంత్ భీమ్‌రావు అంబేడ్కర్ అన్నారు. పల్లంకుర్రులో దళిత నాయకుడు ఇసుకపట్ల వెంకటేశ్వరరావు అధ్యక్షతన అంబేడ్కర్ నూతన విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, సర్పంచి నాతి అలివేణి, బడుగు జేమ్స్ పాల్, మంతెన బాబు, వెంట్రు సుధీర్, కోలాటి సత్యం, దళిత నాయకులు పాల్గొన్నారు.

ఏపీ ఈఏపీ సెట్ ప్రశాంతం



విద్యార్థులను తనిఖీ చేస్తున్న అధ్యాపకులు

అమలాపురం రూరల్: ఏపీ ఈఏపీ సెట్ ప్రవేశ పరీక్షలు అమలాపురం రూరల్ మండలం భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ప్రశాంతగా జరిగాయి. బైపీసీ, అగ్రికల్చర్ విద్యార్థులు పరీక్షలు రాశారు. బీవీసీ కళాశాలలో మొదటి విడతగా 200 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 194 మంది హాజరయ్యారు. ఆరుగురు గైర్హాజరయ్యారని పరీక్షల నిర్వహరణ కోఆర్డినేటర్ అడబాల కుమార్ తెలిపారు.

న్యాయం చేయాలని ఎస్పీకి విన్నపం

అమలాపురం టౌన్: రెండు రోజుల కిందట అల్లవరం మండలం గూడాలలో జరిగిన దాడి కేసులోని బాధితులు స్థానిక కార్యాలయానికి శనివారం వచ్చి ఎస్పీ బి.కృష్ణారావును కలిశారు. తమకు జరిగిన అన్యాయాన్ని ఎస్పీకి వివరించి న్యాయం చేయాలని వేడుకున్నారు. హోమ్‌గార్డు సత్తిబాబు, అతని కుమారుడు చంద్రపాల్, మంగం రామకృష్ణ, సీహెచ్. ఏసురాజు తమపై దాడి చేశారని మామిడికుదురు మండలం నగరం గ్రామానికి చెందిన మట్ట సునీల్‌కుమార్ అల్లవరం పోలీసులకు అదే రోజు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ న్యాయం జరగలేదని బాధితులు ఎస్పీకి విన్నవించారు.

యోగాసనాలపై శిక్షణ



ప్రజలతో కలసి యోగాసనాలు వేస్తున్న ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ రాణి సంయుక్త

అమలాపురం టౌన్: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక గడియారం స్తంభం సెంటరులో ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ బి.రాణి సంయుక్త ఆధ్వర్యంలో యోగాసనాలపై శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు ప్రజలకు యోగాసనాలపై శిక్షణనిచ్చారు. ప్రజలతో కలసి కమిషనర్ రాణి సంయుక్త కూడా యోగాసనాలు వేశారు. ప్రతి ఒక్కరూ రోజులో కనీసం 30 నిమిషాలపాటు యోగాసనాలు వేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఇన్‌చార్జి కమిషనర్ రాణి సంయుక్త పిలుపునిచ్చారు. ఈనెల 21 నుంచి జూన్ 21వ తేదీ వరకూ యోగా మాసోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

ఐఐటీ బీహెచ్‌యూలో పీహెచ్‌డీ ప్రవేశానికి శ్రీలలిత ఎంపిక



కర్రా శ్రీలలిత

అమలాపురం టౌన్: వారణాసిలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో ఒకటైన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ బీహెచ్‌యూ)లో పీహెచ్‌డీ ప్రవేశానికి అమలాపురం రూరల్ మండలం పేరూరు శివారు విశ్వేశ్వర అగ్రహారానికి చెందిన కర్రా శ్రీలలిత అర్హత సాధించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ మెషీన్ లెర్నింగ్ రంగాల్లో పరిశోధన చేయాలన్న సంకల్పంతో పీహెచ్‌డీ చేయనున్నట్టు శ్రీలలిత తెలిపారు. శ్రీలలిత భర్త ఆస్ట్రాలజీ రంగం (జ్యోతిష్యం) శాస్త్రవేత్త కర్రా సంతోష్ శాస్త్రి. ఈమె మావయ్య జ్యోతిష్య పండితుడు డాక్టర్ కర్రా వీరభద్రం. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ మెషీన్ లెర్నింగ్ రంగాల్లో పరిశోధనలు చేసేందుకు వెళుతున్న శ్రీలతితను పలువురు అభినందించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

అమలాపురం టౌన్: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆజాద్ ఫౌండేషన్ కార్యదర్శి ఈవని విశ్వేశ్వరశర్మ అన్నారు. అమలాపురంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ మహిళకు రక్తం అత్యసరమని సమాచారం అందడంతో శనివారం రక్తదానం చేసి ఆ రోగిని కాపాడినట్టు విశ్వేశ్వరశర్మ తెలిపారు. ఈయన ఇప్పటి వరకూ 34 సార్లు రక్తదానం చేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు యల్లమిల్లి నాగ సుధ కొండ తదితరులు విశ్వేశ్వరశర్మను అభినందించారు.

ట్రాఫిక్ ఆంక్షలు.. ప్రయాణికులకు అవస్థలు

- ఈదరపల్లిలో కొత్త వంతెన నిర్మాణంతో రాకపోకలకు ఇబ్బంది
- అధికారుల అనాలోచిత నిర్ణయంతో ప్రజలకు ఇక్కట్లు
- పట్టణంలోకి ప్రవేశించేందుకు ఇరుకుదారుల్లో ప్రయాణం



అమలాపురంలోకి చేరుకునేందుకు ఇరుకు సీసీ రోడ్డు మీదుగా వెళుతున్న ద్విచక్ర వాహన చోదకులు



ఈదరపల్లిలో కొత్త వంతెన నిర్మాణం

అమలాపురం టౌన్: పట్టణం ముఖ ద్వారంలో ఉన్న ఈదరపల్లి పాత వంతెన పక్కనే నూతన వంతెన నిర్మాణం చేపట్టిన క్రమంలో అధికారులు అనాలోచితంగా విధించిన ట్రాఫిక్ ఆంక్షల కారణంగా ప్రజలు రాకపోకలకు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీ బస్సులు, లారీలు, హైటెక్ బస్సుల రాకపోకలకు అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలు చూపారు. ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలకు ఒక్క మార్గమే సూచించడంతో శ్రమ, సమయం ఎక్కువగా వృథా అవుతోందని వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు.

కాలువపై రెండో వైపు క్రాస్ బండ్ నిర్మించాలి

పాత వంతెన సమీపంలోని డాబా గార్డెన్స్ రోడ్డు లోంచి వెళ్లి ఈదరపల్లి అయ్యప్పస్వామి ఆలయం సమీపంలో పంట కాలువపై తాత్కాలికంగా నిర్మించిన క్రాస్ బండ్ నుంచి ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు ట్రాఫిక్ ఆంక్షల ప్రకారం అధికారికంగా పట్టణంలోని సావరంలోకి ప్రవేశిస్తున్నాయి. అయితే వంతెనకు ఇటు వైపు అయ్యప్ప స్వామి ఆలయం సమీపంలో వేసిన క్రాస్‌బండ్ మాదిరిగానే అవతలి వైపు కూడా (వంతెనకు సమీపంలోనే) పంట కాలువపై రూ.లక్ష లోపు వ్యయంతో క్రాస్ బండ్ నిర్మించి ఉంటే వాహనాలు సులభతరంగా పట్టణంలోకి ప్రవేశించే వీలుండేది. ఇలా చేయకుండా డాబా గార్డెన్ రోడ్డులోంచి అయ్యప్పస్వామి ఆలయం వద్ద గల క్రాస్ బండ్ మీదుగా వాహనాలన్నీ వెళ్లడంతో ట్రాఫిక్ సమస్య మరింత జటిలమవుతోంది. అదే వంతెనకు ఇందుపల్లి వైపు కూడా క్రాస్ బండ్ నిర్మిస్తే ట్రాఫిక్ సమస్య లేకుండా రాకపోకలకు వెసులుబాటు ఉండేది. అయ్యప్పస్వామి ఆలయం వద్ద క్రాస్ బండ్ మీదుగా బైపాస్ రోడ్డులోకి, ఆ తర్వాత సావరంలోకి ప్రవేశించి పట్టణంలోకి వెళ్లాలంటే 20 నిమిషాలపైనే సమయం పడుతోందని వాహనదారులు అంటున్నారు. కొంతమంది వాహనచోదకులు ఇందుపల్లి వైపు గ్రావెల్ రోడ్డు సౌకర్యవంతంగా లేకపోయినప్పటికీ దాదాపు కిలోమీటరు మేర ప్రయాసపడుతూ ప్రయాణించి ఈదరపల్లిలోకి వెళ్లేందుకు పంట కాలువపై ఉన్న కాలి బాట వంతెన మీదుగా వెళ్లి ఆ తర్వాత పట్టణంలోకి ప్రవేశిస్తున్నారు. అదే పాత వంతెన సమీపంలోనే పంట కాలువపై క్రాస్ బండ్ నిర్మించి ఉంటే వాహనదారులకు ఇన్ని ఇబ్బందులు ఉండేవి కావు.

ఇరుకు సందుల్లో ప్రయాణం

అయ్యప్ప ఆలయం సమీపంలో నిర్మించిన క్రాస్ బండ్ మీదుగా సావరం రోడ్డులోకి ప్రవేశించే ముందు డ్రెయిన్‌పై ఉన్న వంతెన నుంచి పక్కక వెళితే 100 అడుగుల మేర మట్టితో అధ్వానంగా ఉన్న తోవ వెంబడి వాహనాలను అతికష్టంగా నడిపి అక్కడి నుంచి నాలుగు నుంచి అయిదు అడుగుల వెడల్పుతో ఎప్పుడో నిర్మించిన శిథిల సీసీ రోడ్డు నుంచి ఈదరపల్లి వంతెన సమీపంలో మెయిన్ రోడ్డులో గల రాయల్ బంక్ వద్దకు కొందరు చేరుకుంటున్నారు. సన్నపాటి ఇరుకు సందుల్లో అవస్థలు పడుతూ ద్విచక్ర వాహనాలను నడుపుతూ పట్టణంలోకి ప్రవేశించే తీరు చాలా ఇబ్బందికరంగా ఉంది. ఇలా మూడు మార్గాల్లోంచి వాహన చోదకులు పట్టణంలోకి వచ్చేందుకు అగచాట్లు పడుతున్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు 100 అడుగుల మట్టి తోవ మరింత అధ్వానంగా, ప్రమాదభరితంగా తయారైంది.

ప్రయాణికుల గగ్గోలు.. పట్టించుకోని అధికారులు

పాత వంతెనకు పంట కాలువపై ఒక వైపు నిర్మించిన క్రాస్ బండ్ మాదిరిగా మరోవైపు నిర్మించి ఉంటే ఇన్ని ఇబ్బందులు ఉండేవి కావని వాహనచోదకులు అంటున్నారు. పట్టణ ప్రజల్లోనే కాకుండా అమలాపురానికి వివిధ పనులపై తరలి వచ్చే ప్రయాణికుల నోట రెండో క్రాస్ బండ్ ఎందుకు నిర్మించలేపోయారన్న మాటే వినిపిస్తోంది. కొత్త వంతెన నిర్మాణ పనులు మరో రెండు నెలల సమయం పట్టే పరిస్థితి కనిపిస్తుండడంతో అప్పటి వరకూ ఈ ట్రాఫిక్ ఇక్కట్లు తప్పవా అని ప్రయాణికులు గగ్గోలు పడుతున్నారు. అటు ఆర్అండ్‌బీ, ఇటు పోలీస్ శాఖల సంయుక్తంగా అమలు చేస్తున్న ట్రాఫిక్ ఆంక్షలు వాహనదారులకు శాపంగా మారాయి. కొత్త వంతెన నిర్మాణంతో పట్టణంలోకి వెళ్లేందుకు అధికారులు ఒకే ఒక్క మార్గాన్ని చూపిస్తే ప్రజలు మరో రెండు మార్గాల వెంబడి అసౌకర్యాల నడుమ అనధికారికంగా అతికష్టంగా ప్రయాణించి పట్టణంలోకి చేరుకుంటున్నారు.

21 వరకు యోగాంధ్ర మాసోత్సవాలు



బాలయోగి స్టేడియంలో మాస్టర్ ట్రైనీల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

అమలాపురం రూరల్: వికసిత్ భారత్ స్ఫూర్తితో ఆరోగ్యకరమైన స్వర్ణాంధ్ర సాకారానికి పునాది పడేలా యోగాంధ్ర మాసోత్సవాలను ఈ నెల 21న ప్రభుత్వం చేపట్టిందని ఈ కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ టీ నిషాంతి పిలుపునిచ్చారు. శనివారం జీఎంసీ బాలయోగి స్టేడియంలో 100 మంది మాస్టర్ ట్రైనీలతో నిర్వహించే యోగా శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ థీమ్ ఆధారిత యోగాంధ్ర మాసోత్సవాలను పురస్కరించుకొని మే 21 నుంచి జూన్ 21 వరకు జిల్లా వ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం యోగా ట్రైనర్ల సేవలను ఉపయోగించుకుంటామన్నారు. రెండు రోజులపాటు మాస్టర్ ట్రైనీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రతి గ్రామ, వార్డు సచివాలయం పరిధిలో ట్రైనర్లు అందుబాటులో ఉంటారని, ఒక్కో ట్రైనర్ ఒక సెషన్‌లో కనీసం 50 మందితో యోగాభ్యసనం చేయించనున్నట్లు తెలిపారు. ఏడాది విశాఖలో నిర్వహించే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రధాన మంత్రి హాజరు కానున్నట్లు తెలిపారు. రోజువారీగా 45 నిమిషాలపాటు యోగాభ్యసన కార్యక్రమాలు గ్రామ, మండల, డివిజన్, మున్సిపల్, జిల్లాస్థాయిలో నిర్వహిస్తామని తెలిపారు. యోగాపై వివిధ రకాల పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ మాధుసూదనరావు, డీఆర్డీఏ పీడీ నాగేశ్వరరావు, జిల్లా ఆయుష్ వైద్య అధికారి విజయ్ కుమారి, యోగా ట్రైనర్లు, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

బాలబాలికలకు విద్యాసామగ్రి పంపిణీ



మునిపల్లిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ దంగేటి జానకి, కో ఆర్డినేటర్ శ్రీకాంత్ తదితరులు

ఉప్పలగుప్తం: మహిళలు, బడుగు బలహీల వర్గాల ప్రజలు సమాజంలో గౌరవంగా జీవించే విధంగా వారికి హక్కులు కల్పించిన ఘనత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కే దక్కుతుందని అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ అన్నారు. మండలంలోని మునిపల్లిలో వైస్ ఎంపీపీ సాదే శ్రీనువాసరావు అధ్యక్షతన నిర్వహించిన అంబేడ్కర్ 134 జయంత్యుత్సవాలకు కోఆర్డినేటర్ శ్రీకాంత్, ఎంపీపీ దంగేటి వీర అచ్యుతజానకి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ దంగేటి వీర అచ్యుత జానకి ఎంపీపీ నిధులతో సమకూర్చిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని శనివారం పునఃప్రారంభించి, పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వైస్ ఎంపీపీ శ్రీనువాసరావు సమకూర్చిన పుస్తకాలు, పెన్నులు తదితర విద్యాసామగ్రిని కోర్డినేటర్ శ్రీకాంత్, ఎంపీపీ జానకి గ్రామంలోని విద్యార్థినీ, విద్యార్థులకు అందించారు. అనంతరం ఎంపీపీ అచ్యుత జానకీ, రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు దంపతులను గ్రామస్తులు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు యర్రంశెట్టి రామచంద్రరావు, బద్రి బాబ్జి, కడిమి చిన్నవరాజు, పెయ్యిల రాజ్‌కుమార్, ఎంపీటీసీలు పెట్టా అప్పారావు, వంగా గిరిజాకుమారి, తాళ్ల లక్ష్మీ నరసాయమ్మ, కొంకి ఏడుకొండలు, నిమ్మకాయల రాము, పార్టీ ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనువాస్, జిల్లా ఐటీ విభాగం అధ్యక్షుడు తోరం గౌతమ్‌రాజా, పార్టీ నాయకులు కుంచే రమణారావు, చీకట్ల కిషోర్, మోటూరి సత్యంకాపు, నిమ్మకాయల హనుమంతు శ్రీనువాస్, గుద్దటి నాగరాజు, గ్రామ పెద్దలు నిమ్మకాయల సూర్యనారాయణమూర్తి, దోనిపాటి అశోక చక్రవర్తి, నిమ్మకాయల వెంటేశ్వరరావు, సాదే శ్రీ ఆంజనేయులు, తాళ్ల రవి పాల్గొన్నారు.

విశ్వరూప్ పరామర్శ



లక్ష్మి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విశ్వరూప్

అమలాపురం టౌన్: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై అమలాపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉప్పలగుప్తం వైఎస్సార్ సీపీ నాయకుడు విద్యాసాగర్‌ను మాజీ మంత్రి, పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ పినిపే విశ్వరూప్ శనివారం పరామర్శించారు. విశ్వరూప్‌తోపాటు పార్టీ నాయకుడు మోటూరి సత్యంకాపు కూడా విద్యాసాగర్‌ను పరామర్శించిన వారిలో ఉన్నారు.

కామిశెట్టి శ్రీనివాసరావు కుటుంబానికి పరామర్శ

అమలాపురం రూరల్: బండారులంకకు చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామిశెట్టి శ్రీనివాసరావు తల్లి లక్ష్మి మృతికి వైఎస్సార్ సీపీ పార్లమెంట్ నియోజవర్గ కోఆర్డినేటర్, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ సంతాపం తెలిపారు. ఇటీవల శ్రీనివాసరావు తల్లి అనారోగ్యంతో మృతి చెందారు. విశ్వరూప్ శనివారం శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను పరామర్శించి లక్ష్మి చిత్రపటానికి పూలమాలువేసి నివాళులర్పించారు. జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు జాన్ గణేష్, మాజీ సర్పంచ్ నక్కా సంపత్‌కుమార్, పార్టీ నాయకులు ఉటాల ఉదయకుమార్, మొసలి స్వర్ణన్ రాజు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

జిప్‌మెర్‌లో డయాలసిస్ సేవలు ప్రారంభం

యానాం: కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని జాతీయ ప్రాముఖ్యత గల యానాం జిప్‌మెర్ ఆసుపత్రిలో శనివారం నుంచి డయాలసిస్ సేవలు ప్రారంభించినట్లు చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆనంద్‌రాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయాలసిస్‌కు చెందిన ఫస్ట్ సెషన్ ప్రారంభమైందని మరో రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. డయాలసిస్ సేవల కోసం కిడ్నీ వ్యాధిగ్రస్తులు దూరప్రాంతమైన కాకినాడ తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు తప్పుతాయన్నారు. డయాలసిస్ సేవలను యానాంతో పాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల ప్రజలు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే అశోక్ అన్నారు. జిప్‌మెర్‌లో డయాలస్ సేవలు ప్రారంభించాలని తాను గత రెండు అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని కోరినట్లు ఆయన తెలిపారు. న్యూఢిల్లీలో కేంద్ర కార్యాలయానికి సైతం తాను లేఖలు రాసినట్లు తెలిపారు.

సామాజిక న్యాయం పాటించాలి

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తున్న క్రమంలో సామాజిక న్యాయం పాటించాలని శనివారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఏఎం సలీమ్ తదితరులు సీఎం రంగసామికి వినతిపత్రం అందజేశారు. అసిస్టెంట్ పోస్టుల భర్తీలో బీసీ, ఓబీసీ, ఎస్సీ వర్గాల హక్కులను ఉల్లంఘిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో రిజర్వేషన్ దామాషా పాటించాలని పేర్కొన్నారు. ఈడబ్ల్యూఎస్ కోటా కేటాయింపులో నిబంధనలు పాటించాలన్నారు. 2012 ఏప్రిల్ 20న విడుదల చేసిన రిక్రూట్‌మెంట్ పాలసీలో 20 శాతం అసిస్టెంట్ పోస్టులు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా నియామకాలు చేపడతామని పేర్కొన్నారని గుర్తు చేశారు.

నీతి ఆయోగ్ సమావేశానికి సీఎం గైర్హాజరు

యానాం: సీఎం రంగసామి శనివారం న్యూఢిల్లీలో నిర్వహించిన నీతి ఆయోగ్ సమావేశానికి గైర్హాజరయ్యారు. ఆర్థిక శాఖను కూడా నిర్వహిస్తున్న ఆయన ఈ సమావేశాలకు గైర్హాజరుకు గల కారణాలను వెల్లడించలేదు. నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశానికి గతేడాది కూడా ఆయన వెళ్లలేదు. ప్రధాన మంత్రి అధ్యక్షతన నిర్వహించే పాలక మండలి సమావేశాల్లో జాతీయ ప్రాముఖ్యత కలిగిన అంశాలను చర్చిస్తారు. ఈ సమావేశాల్లో సీఎం పాల్గొంటే పుదుచ్చేరికి కావాల్సిన నిధులు తదితర అంశాలను చర్చించడానికి అవకాశం ఉండేదని, ఈ అవకాశాన్ని వదులుకున్నారని ప్రతిపక్ష నాయకుడు శివ విమర్శించారు. దీనిపై సీఎం ప్రజలకు వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

తాచుపాము హల్‌చల్

అమలాపురం రూరల్: భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల వెనుక ముత్తాబత్తుల వారిపేటలో ఒక ఇంట్లో తాచుపాము హల్‌చల్ చేసింది. ముత్తాబత్తుల బాలయ్య ఇంటిలోకి దూరిన తాచుపాము రెండు రోజులుగా హల్‌చల్ చేయడంతో కుటుంబ సభ్యులను భయాందోళనకు గురయ్యారు. ఉప్పలగుప్తం మండలం భీమనపల్లిలో ఉన్న స్నేక్ క్యాచర్ గణేష్ వర్మకు వారు సమాచారం అందించడంతో ఆయన వచ్చి పాముని పట్టుకుని డబ్బాలో బంధించారు.ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ వేసవి కాలంలో పాముల సంచారం అధికంగా ఉంటుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఎక్సైజ్ అధికారుల విస్తృత తనిఖీలు



యానాం మద్యంతో పట్టుబడిన ముద్దాయిలతో ఎక్సైజ్ పోలీసులు

తాళ్లరేవు: ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరెంటెండెంట్ కె. విజయమానిక, తాళ్లరేవు ఎక్సైజ్ సీఐ కె.కోటేశ్వరరావు బృందం శుక్రవారం రాత్రి విస్తృత తనిఖీలు నిర్వహించారు. కాకినాడ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ డా ఏనుగుల చైతన్య మురళి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ తనిఖీల్లో రెండు కార్లు, ఒక మోటార్ సైకిల్‌పై కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నుంచి మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న నలుగురిని అరెస్ట్ చేసారు. నూకవల్లి అరుణ్‌కుమార్, దున్నా మోహన్, దోనం ఆదిసత్యనారాయణ, వీరాస్వామి మార్కస్‌ను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 750 ఎం.ఎల్ సీసాలు 33, 180 ఎం.ఎల్ 5, బీరు బాటిళ్లు 12 స్వాదీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం తరలింపునకు వినియోగించిన రెండు కార్లు, మోటార్ సైకిల్‌ను సీజ్ చేసినట్లు ఎక్సైజ్ అధికారులు శనివారం తెలిపారు.

మున్సిపల్ ఛైర్‌పర్సన్‌కు పలువురి పరామర్శ



మున్సిపల్ ఛైర్‌పర్సన్ నాగేంద్రమణిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు కిరణ్



కొమరగిరిపట్నంలో సీతారత్నం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ కో-ఆర్డినేటర్ శ్రీకాంత్

అమలాపురం టౌన్: మాతృ వియోగంతో బాధపడుతున్న అమలాపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణిని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు శనివారం వేర్వేరుగా పరామర్శించారు. ఛైర్‌పర్సన్ తల్లి శ్రీరామ రాఘవమ్మ ఈనెల 17న వృద్ధాప్యంతో స్థానిక నారాయణపేటలోని స్వగృహంలో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు దివంగత శ్రీరామ రాఘవమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ చిక్కాల గణేష్, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, కౌన్సిలర్ బొర్రా వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు వేగిరాజు సాయిరాజు, మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు తదితరులు మున్సిపల్ ఛైర్‌పర్సన్‌ను పరామర్శించారు.

మధు కుటుంబానికి పరామర్శ

అల్లవరం: కొమరగిరిపట్నంలో ఆకుల మధు తల్లి సీతారత్నం అకాల మృతికి అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో-ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ సంతాపం తెలిపారు. మధు కుటుంబ సభ్యులను శ్రీకాంత్ శనివారం పరామర్శించారు. ఎంపీపీ ఇళ్ల శేషారావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, నాయకులు సాధనాల శ్రీను, నిమ్మకాయల శేఖర్ సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ పరామర్శ: ఆకుల మధు కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ శనివారం పరామర్శించి తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఎంపీటీసీ పిచ్చెట్టి వెంకటేశ్వరరావు నాయకులు దండు బుజ్జి, తాతాజీ, నిమ్మకాయల శేఖర్ పరామర్శించిన వారిలో ఉన్నారు.

జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో మార్పులు

యానాం: జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ చేయడంలో ఇకపై కొత్త నియమావళిని అమలు చేస్తున్నట్లు శనివారం పుదుచ్చేరి ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు మున్సిపాలిటీలకు ఆదేశాలు జారీ అయ్యాయి. అందులో భాగంగా ఇక నుంచి జనన, మరణ ధ్రువీకరణ పత్రాల్లో తండ్రి, తల్లి పేర్లు, పుట్టిన ప్రదేశం, ఒక వేళ మరణిస్తే మరణించిన ప్రదేశం, వారి ఆధార్ నంబర్లు, శాశ్వత చిరునామా, ప్రస్తుతం నివాసం అడ్రస్ తదితర వివరాలను నమోదు చేయాలని పేర్కొంది. తల్లిదండ్రుల ఆధార్ నంబర్లు సర్టిఫికెట్‌లో నమోదు చేయడం వల్ల భవిష్యత్తులో వివిధ ప్రయోజనాలు ఉంటాయన్నారు. పిల్లల పేర్ల నమోదు ప్రక్రియలో కొత్త విధానాన్ని ప్రవేశపెట్టారు. బిడ్డపుట్టిన 30 రోజుల్లోపు ఆ బిడ్డ వివరాలను సంబంధిత పత్రాలతో మున్సిపాలిటీలో సంప్రదించి నమోదు చేసుకోవాలని ఆదేశించారు. పిల్లల పేర్ల నమోదులో 30రోజుల నుంచి ఒక ఏడాది వరకు ఆలస్యమైతే ఆ ఫైలును మున్సిపాలిటీ ద్వారా ప్రభుత్వ డైరెక్టర్‌కు పంపవచ్చునన్నారు.

వేంకటేశ్వరుని దర్శనానికి పోటెత్తిన భక్తులు



నల్లచెరువు వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. స్వామివారి దర్శనం కోసం తెల్లవారు జాము నుంచి భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. వేంకటేశ్వరస్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు జరిపారు. స్వామికి తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు జరిపారు. వేదపండితులు స్వామికి లక్ష తులసి పూజ నిర్వహించారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయం వద్ద భక్తులకు భారీ అన్నదానం చేశారు. స్వామివారికి భక్తులు పటిక బెల్లం తులాభారం నిర్వహించి మొక్కు తీర్చుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

జాబ్ మేళాలో 89 మందికి ఉద్యోగావకాశాలు



జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులు

ముమ్మిడివరం: స్థానిక ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 89 మందికి ఉద్యోగావకాశాలు లభించినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి డి.హరిశేషు తెలిపారు. మొత్తం 11 కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించగా 185 మంది నిరుద్యోగ యువతీ, యువకులు పాల్గొన్నారని, అందులో 89 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారిణి వసంతలక్ష్మి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కే రాజేంద్రప్రసాద్, జిల్లా వికాస్ మేనేజర్ రమేష్, స్కిల్ డవలప్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీ పరిసరాల్లో చెట్లను తొలగించాలి

మామిడికుదురు: నగరం పీహెచ్‌సీ పాత భవనం చుట్టూ దట్టంగా మొలిచిన చెట్లను తక్షణం తొలగించి పీహెచ్‌సీ పరిసరాలను పరిశుభ్రం చేయాలని అమలాపురం ఆర్డీఓ కె.మాధవి ఆదేశించారు. పాడైపోయిన నగరం పీహెచ్‌సీ పాత భవనాన్ని ఆర్డీఓ శనివారం పరిశీలించారు. పాడైపోయిన పాత భవనాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు రెవెన్యూ, ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కొత్త భవనం అందుబాటులో ఉండగా పాత భవనంలో చిన్నారులకు పోలియో చుక్కలు ఎందుకు వేస్తున్నారంటూ పీహెచ్‌సీ ఉద్యోగులపై మండిపడ్డారు. ఆమె వెంట తహసీల్దార్ శరణ్య, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి స్వర్ణలత, పీహెచ్‌సీ సిబ్బంది ఉన్నారు.

పిచ్చికుక్క దాడిలో ఇద్దరికి గాయాలు

పి.గన్నవరం: పి.గన్నవరం శివారు బోడపాటివారి పాలెం గ్రామంలో శనివారం ఒక పిచ్చికుక్క వీర విహారం చేసింది. ఎస్.నాగమణి, బి.వెంకటేశ్వరరావులను పిచ్చి కుక్క కరవడంతో వారు గాయాల పాలయ్యారు. వీరిలో నాగమణిని పి.గన్నవరం సీహెచ్‌సీకి తరలించగా అక్కడ చికిత్స పొందుతోంది. గ్రామంలో కుక్కలు పెరిగిపోయినా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల క్రితం ఒక పిచ్చి కుక్క ఆరు ఆవులు, ఐదు గేదెలపై దాడి చేసి కరిచింది. ఇకనైనా అధికారులు స్పందించి కుక్కలను పట్టించాలని బోడపాటివారి పాలెం ప్రజలు కోరుతున్నారు.